సాక్షి
గుంటూరు
శనివారం ǀ 27 ǀ ఏప్రిల్ ǀ 2024



జగనన్నకు అండగా నిలుస్తాం

ఫిరంగిపురం: తక్కెళ్లపాడుకి చెందిన 11 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. ప్రజాసంక్షేమం కోసం పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలుస్తామని తెలిపారు.



వైభవంగా విగ్రహ ప్రతిష్ట

భట్టిప్రోలు: గొరిగపూడి పంచాయతీ పెదవరి కూటివారిపాలెంలో నిర్మించిన కోదండరామ స్వామి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

రేపు వీరాంజనేయస్వామి తిరునాళ్ల



వినుకొండటౌన్: మద మంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్లను ఆదివారం నిర్వహిస్తున్నట్లు, ఆలయ ప్రధాన అర్చకుడు ఎం.రాఘవేంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరునాళ్ల సందర్భంగా ఆకు పూజ, అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

న్యూస్‌రీల్

నేడు 'పాలిసెట్-2024'

గుంటూరు, తెనాలిలో 14 పరీక్ష కేంద్రాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికై శనివారం పాలిసెట్-2024 జరగనుంది. గుంటూరు నగరంతో పాటు తెనాలిలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గుంటూరు నగర పరిధిలోని 11 కేంద్రాల్లో 4,628 మంది విద్యార్థులతో పాటు తెనాలిలోని మూడు కేంద్రాల్లో మరో 800 మంది చొప్పున హాజరు కానున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు పరీక్ష జరగనుండగా, విద్యార్థులను ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. విద్యార్థులు హాల్ టిక్కెట్, బాల్ పాయింట్ పెన్, హెచ్‌బీ పెన్సిల్, ఎరేజర్, షార్ప్‌నర్ తమ వెంట తీసుకుని వెళ్లాలని, ఇవి మినహా సెల్‌ఫోన్, కాలిక్యులేటర్ వంటి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని పాలిసెట్-2024 గుంటూరు జిల్లా సమన్వయ కర్త తాళ్లూరి శేఖర్ పేర్కొన్నారు. నిర్ణీత సమయం దాటిన తరువాత ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతించబోమని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వైద్య సేవలతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

అనుక్షణం అప్రమత్తత అవసరం



నగరంపాలెం: అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీస్ ఎన్నికల పరిశీలకులు సత్యార్థ్ అనిరుద్ పంకజ్ సూచించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా శుక్రవారం జిల్లాలోని నడింపాలెం, నారాకోడూరు, పొన్నూరులోని మంచాల చెక్‌పోస్ట్‌ల వద్ద ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా చెక్‌పోస్ట్‌ల్లో విధులు నిర్వర్తించే అధికార, సిబ్బందితో ఆయన మాట్లాడారు. చెక్‌పోస్ట్‌ల వద్ద అనుసరించాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. ఆయన వెంట ట్రైనీ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, ఐటీ కోర్ సోషల్ మీడియా సీఐ మౌలా షరీఫ్ తదితరులు ఉన్నారు.

యార్డులో 62,153 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 59,655 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 62,153 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.20,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 42,701 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

ఎన్నికల్లో భాగస్వామ్యం కావాలి



నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో స్వచ్ఛందంగా ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎస్ఎస్ఎన్ వలంటీర్లు పాల్గొనాలని ట్రైనీ కలెక్టర్ కేఆర్.కల్పశ్రీ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ కళాశాలల యాజమాన్యాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధులలో పాల్గొనే ఎన్.సి.సి క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు పోస్టల్ బ్యాలెట్ వసతిని కల్పించామని, దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో కె.వినాయకం, అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆర్.రాఘవేంద్ర, వివిధ కళాశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6500, గరిష్ట ధర రూ.8600, మోడల్ ధర రూ.7200 వరకు పలికింది.







ప్రచార పర్వం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల అనంతరం అభ్యర్థులు ఎన్నికల ప్రచారం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం గుంటూరు 36వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని ఇంటింటి ప్రచారం నిర్వహించి, ఓటు అభ్యర్థించారు. వార్డు మహిళలు రజినికి ఘనస్వాగతం పలికారు. గుంటూరు రూరల్ మండలం 46వ డివిజన్ నగరాలులో జరిగిన ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. తూర్పు అభ్యర్థి నూరిఫాతిమా నియోజకవర్గంలోని 54వ డివిజన్ పర్యటించి, ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించారు. - పట్నంబజారు, గుంటూరు రూరల్

పార్లమెంట్‌కు 34.. అసెంబ్లీకి 141

- నామినేషన్ల ఆమోదం
- ముగిసిన పరిశీలన ప్రక్రియ
- వివరాలు వెల్లడించిన జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి



పార్లమెంట్ అభ్యర్థుల నామినేషన్లు స్క్రూటినీ చేస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

సాక్షి ప్రతినిధి గుంటూరు: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్క్రూటినీ ముగిసింది. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి నామినేషన్ల స్క్రూటినీ నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు, ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి 47 మంది అభ్యర్థులు 67 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, స్క్రూటినీలో సక్రమంగా ఉన్న జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నుంచి ముగ్గురు అభ్యరులు, రిజిస్టర్డై, గుర్తింపు లేనటువంటి రాజకీయపార్టీల నుంచి 17 మంది అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు 14 మంది, మొత్తం 34 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదించారు. సక్రమంగా లేని 13 మంది అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించటం జరిగింది. ఈ ప్రక్రియను ఎన్నికల పరిశీలకురాలు కార్తిక పరిశీలించారు. ఈ నెల 27, 29 తేదీలలో ఉపసంహరణ అనంతరం 29న తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

❖ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 31 నామినేషన్లు ఆమోదించారు. నియోజకవర్గానికి దాఖలైన 55 నామినేషన్లను పరిశీలించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సరైన ధ్రువపత్రాలు, అవసరమైన డాక్యుమెంట్స్ లేని 8 నామినేషన్లను తిరస్కరించగా, 47 నామినేషన్లను ఆమోదించారు. 47 నామినేషన్లలో డమ్మీలుగా, అదనపు నామినేషన్ సెట్లు దాఖలు చేసిన వాటిని అభ్యర్థుల సమక్షంలోనే తిరస్కరించారు. అనంతరం పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి 31 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. తాడికొండలో 16 నామినేషన్లకుగాను 6 నామినేషన్లు తిరస్కరించగా 10 నామినేషన్లు ఆమోదించారు. మంగళగిరిలో 44 మంది అభ్యర్థులకు గాను ఇద్దరివి తిరస్కరించగా 42 మంది బరిలో నిలిచారు. పొన్నూరులో 18 మందికి గాను నలుగురి నామినేషన్లు తిరస్కరణకు గురికాగా 14 నామినేషన్లు ఆమోదించారు. తెనాలిలో 20 మందికి గాను ఆరుగురి నామినేషన్లు తిరస్కరించగా 14 ఆమోదం పొందాయి. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ ఇద్దరికీ బీ-ఫారంలు ఇవ్వడంతో ఇద్దరి నామినేషన్లు తిరస్కరించారు. కాంగ్రెస్ తరపున షేక్ బాషిద్‌కు, చందు సాంబశివుడుకు పీసీసీ బీ-ఫారాలు ఇచ్చింది. దీంతో ఈ రెండు నామినేషన్లను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. ప్రత్తిపాడులో 15కి గాను రెండు తిరస్కరణకు గురికాగా 13 ఆమోదం పొందాయి. గుంటూరు తూర్పులో 29 మందికి గాను 12 నామినేషన్లు తిరస్కరణకు గురికాగా 17 నామినేషన్లు ఆమోదం పొందాయి. అసెంబ్లీకి మొత్తం 141 నామినేషన్లు ఆమోదం పొందాయి.

29న సీఎం జగన్ బహిరంగ సభ

- పొన్నూరు అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాట్లు
- సభా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి

పొన్నూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 29వ తేదీన పొన్నూరుకు రానున్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జరగనున్న భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సీఎం సభ ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణలు శుక్రవారం పరిశీలించారు. 29న మధ్యాహ్నం 3 గంటలకు అంబేడ్కర్ సెంటర్‌లో జరిగే బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తలశిల రఘురాం విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాల్గొనే బహిరంగ సభకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరవుతున్న నేపథ్యంలో అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. రానున్న ఎన్నికలలో ఎంపీ అభ్యర్థి రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణలను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గ ప్రజలను పలకరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 29న వస్తున్నారని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.



సభాస్థలంపై చర్చిస్తున్న కిలారి రోశయ్య, తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, అంబటి మురళీకృష్ణ

విడదల రజిని వెన్నంటే ఉంటాం



ఐక్యతను చాటుతున్న మాల మహానాడు నేతలు అన్నవరపు కిషోర్, కెనడీ, వెంకట్రావు తదితరులు

మాల మహానాడు అధ్యక్షుడు అన్నవరపు కిషోర్

పట్నంబజారు: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో బీసీ మహిళ మంత్రి విడదల రజిని గెలుపుకోసం తామంతా కృషి చేస్తామని, ఆమె వెన్నంటే ఉంటామని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు కిషోర్ పేర్కొన్నారు. చంద్రమౌళినగర్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిలకలూరిపేట మార్కెట్ యార్డు చరిత్రలో తొలిసారి ఏకంగా ఇద్దరు ఎస్సీలను యార్డు చైర్మన్‌లుగా చేసిన గొప్ప నాయకురాలు మంత్రి విడదల రజిని అని కొనియాడారు. చిలకలూరిపేట పట్టణం నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి చరిత్ర సృష్టించిన విడదల రజినికి దళిత సంఘాలన్నీ మద్దతుగా నిలబడతాయని చెప్పారు. రానున్న ఎన్నికలకు సంబంధించి పూర్తిస్థాయిలో మాలమహానాడు రాష్ట్ర కమిటీ సమావేశంలో తగు నిర్ణయాలు తీసుకోవటం జరిగిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు దళిత ద్రోహి అని ధ్వజమెత్తారు. తొలి నుంచి చంద్రబాబుకు దళితులంటే చిన్నచూపేనని మండిపడ్డారు. మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి కెనడీ మాట్లాడుతూ గత 30 ఏళ్ల నుంచి రాష్ట్రంలో మాలలపై కక్షకట్టిన దళిత ద్రోహి చంద్రబాబునాయుడు అన్నారు. అన్నదమ్ముల్లా కలిసి ఉండే దళితుల్లో విషపురుగు నాటిన వ్యక్తి బాబు అని ధ్వజమెత్తారు. మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గెద్దం వెంకట్రావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారం దక్కాలని అంబేడ్కర్ కలలు కన్నారని, వాటిని సాకారం చేసే శక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ఉందని తెలిపారు. బీసీ మహిళ విడదల రజినిని గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఆమె గెలుపు కోసం రాష్ట్ర మాల మహానాడు సమష్టిగా పనిచేస్తుందని చెప్పారు. వైఎస్సార్ సీపీకి మద్దతుగా చేతులు కలిపి సంఘీభావాన్ని తెలియజేశారు. మాలమహానాడు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బత్తుల అనిల్, గోపతోటి విజయ్, స్టేట్ యూత్ అధ్యక్షుడు వంజ లూథర్‌బాబు, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల బాబి, తిరుపాల్, మెండెం రాంబాబు, ముసుకు రవికుమార్, బత్తుల నాగరాజు, సురేష్, జి.సురేష్, పిడతల దేవాస్, కూనల చినసుబ్బారావు, సిఖినం బాలయ్య, బోరుగడ్డ సందీప్, అన్నలదాసు ప్రసాద్, వీర్ణపు దుర్గాప్రసాద్, కోడె పండు పాల్గొన్నారు.

బాధ్యతతో ఎన్నికల విధులు

- ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి
- ఎన్నికల వేళ అక్రమాలపై కఠినంగా వ్యవహరించాలి
- పోలీస్ అధికారులతో జిల్లా పోలీస్ ఎన్నికల పరిశీలకులు/డీఐజీ సమావేశం



మాట్లాడుతున్న డీఐజీ సత్యార్థ్ అనిరుద్ పంకజ్, పక్కన ఎస్పీ తుషార్‌డూడీ

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఎన్నికల విధులను నిర్వహించాలని జిల్లా పోలీస్ ఎన్నికల పరిశీలకుడు, డీఐజీ సత్యార్థ్ అనిరుద్ పంకజ్ స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, నియోజకవర్గాల పోలీస్ నోడల్ అధికారుల వివరాలు, జిల్లా భౌగోళిక విస్తీర్ణం, సరిహద్దులు, అసెంబ్లీ/పార్లమెంట్ స్థానాలు, పోలింగ్ కేంద్రాలు, చెక్ పోస్ట్‌లు ఇతరత్రా అంశాలపై డీఐజీకి తెలియజేశారు. ఈ ఎన్నికలపై పోలీస్ శాఖ చేపట్టిన చర్యలు, విధులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా ఎస్పీ తుషార్ డూడీ వివరించారు. ఈ సందర్భంగా పరిశీలకుడు సత్యార్థ్ అనిరుద్ పంకజ్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్నికల వేళ జరిగే అక్రమాలపై కఠినంగా ఉండాలని చెప్పారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని అన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, ట్రైనీ ఐపీఎస్ మనోజ్ హెగ్డే, గుంటూరు తూర్పు ఏఎస్పీ నిచికేత్ షెల్కే, ఏఎస్పీలు శ్రీనివాసరావు (ఎల్/ఓ), ఎన్నికల నోడల్ అధికారి జీవీ రమణమూర్తి, ఎం.వెంకటేశ్వరరావు (సెబ్), హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు మహబూబ్ బాషా, పోతురాజు, అశోక్ కుమార్‌గౌడ్, రవికాంత్, మల్లిఖార్జునరావు, శాంతకుమార్, ఎన్నికల సెల్ అధికారులు బిలాలుద్దీన్, చంద్రశేఖర్, వెంకట్రావు, ఆర్‌ఐలు హరిరెడ్డి, శ్రీనివాసరావు, బ్రహ్మానందం పాల్గొన్నారు.

సర్వేజన సుఖినోభవంతు

- ఇప్పటివరకు 1,41,448 ఎకరాల్లో పూర్తి
- 173 గ్రామాల్లో డ్రోన్ సర్వే
- భూ రక్షణ కోసం 84 వేల హద్దురాళ్లు
- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్న ప్రక్రియ
- స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న గ్రామస్తులు

భూ సర్వేతో సమస్యలకు చెక్



ప్రత్తిపాడులో డ్రోన్ ద్వారా మ్యాపింగ్ చేస్తున్న దృశ్యం

గుంటూరు వెస్ట్: ప్రజల కోసం ఏదైనా చేయాలనే సంకల్పం ఉండాలేగాని కొండల్ని కూడా పిండి చేయవచ్చని నిరూపించింది రాష్ట్ర ప్రభుత్వం. దాదాపు వందేళ్ల క్రితం బ్రిటిష్ కాలంలో నిర్వహించిన సర్వే తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంకా చెప్పాలంటే దేశం మొత్తం మీద అత్యాధునిక శాస్త్ర శాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిర్వహించిన సర్వే ఓ చరిత్రనే చెప్పాలి. డిసెంబర్ 2020లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భూముల రీ సర్వే కోసం 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షణ పథకం' లాంఛనంగా ప్రారంభించారు. అంటే ప్రజల భూమికి హక్కుతోపాటు రక్షణ కూడా కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రారంభించారు. మన జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రత్తిపాడు మండలంలోని కొండజాగర్లమూడి, దుగ్గిరాల మండలంలోని దేవరపల్లి అగ్రహారం, శృంగారపురం, చింతలపూడి. చేబ్రోలు మండలంలోని మీసరగడ్డ అనంతవరం మొత్తం 5 గ్రామాలను ఎంపిక చేశారు.

ఎందుకీ సర్వే..?

దేశంలో నమోదవుతున్న కేసుల్లో దాదాపు సగానికి పైగా భూ వివాదాలే ఉంటున్నాయి. చిన్న చిన్న అంశాలకు సైతం కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఇవి సివిల్ నుంచి క్రిమినల్ కేసులుగా మారుతున్న సందర్భాలూ అనేకం. దీంతో పాటు ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న రెవెన్యూ రికార్డులు సైతం ఎప్పుడో బ్రిటిష్ కాలం ఆధారంగానే జరుగుతున్నాయి. దీనికి గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలకు శాశ్వతంగా పరిష్కారం చూపాలని 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షణ పథకం' తీసుకొచ్చారు. దీనివల్ల భూమికి నిర్దిష్టమైన కొలతలతోపాటు, సర్వే రాళ్ల ఏర్పాటు ద్వారా రక్షణ కూడా ఏర్పడుతుంది. ఇవన్నీ ఉచితంగానే అందిస్తున్నారు. అంతేకాదు. ప్రపంచంలో ఎక్కడి నుంచైనా గూగుల్ ద్వారా మన భూమిని చూసుకోవచ్చు.

ఉపయోగాలివే..

ఒక్కసారి రీ సర్వే జరిగితే చాలు భూయజమాని ప్రపంచంలో ఎక్కడ నుంచైనా తన భూమిని గూగుల్ మ్యాప్స్ ద్వారా చూసుకోవచ్చు. ఎంతమంది ప్రయత్నించినా హద్దులుగాని, భూ కొలతలుగాని మార్చేందుకు వీలుండదు.



మ్యాపింగ్ చేసిన తర్వాత భూమి చిత్రం

సివిల్, క్రిమినల్ తగాదాలకు శాశ్వత పరిష్కారం

ఇక భూ వివాదాలు గ్రామాల్లో ఉండవనే చెప్పాలి. భూ యజమాని లేడుకదా అని కబ్జాలకు తెగబడే వీలుండదు. అన్ని వివరాలు ఆధునిక పరిజ్ఞానంతో నమోదు చేయబడి ఉంటాయి. సర్వే అయిన తర్వాత ఉచితంగా ప్రింటెడ్ పాస్‌బుక్స్ ఇస్తారు. ఇవి అత్యంతం భద్రం . క్రయవిక్రయాలు అత్యంతం పారదర్శకంగా జరుగుతాయి. మోసాలకు తావుండదు.

173 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి

కొత్తగా ఏర్పడిన గుంటూరు జిల్లాలోని మొత్తం 223 గ్రామాలకు గానూ 24 గ్రామాలు సీఆర్డీఏ పరిధిలోనూ మరో 26 గ్రామాలు పట్టణాల్లో కలిసిపోయాయి. మిగిలిన 173 గ్రామాలకు గానూ 4,64,912 ఎకరాలు సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 66 గ్రామాల్లోని 1,42,448 ఎకరాల్లో సర్వే పూర్తయ్యింది. దీనికి ఇరువైపులా సుమారు 84 వేల సర్వే రాళ్లు కూడా వేశారు. అంతేకాకుండా తొలిసారి గ్రామ కంఠం భూములకు సైతం సర్వే నిర్వహించారు. దీన్లో భాగంగా 66 గ్రామాల్లోని 9,920 మందికి సంబంధించిన గ్రామ కంఠం భూములకు ఉచితంగా పట్టాలు సైతం అందజేశారు. ముఖ్యంగా జిల్లా అధికారులు, సర్వేయర్లు, సిబ్బంది చేసిన కృషి ఎంత చెప్పినా తక్కువే.

దిగులు లేదు..



రీ సర్వే అంటే మొదట్లో సందేహించాం. అయితే సిబ్బంది వివరించి చెప్పడంతో ఒప్పుకున్నాను. నా భూమిని అద్భుతంగా కొలతలు వేయడంతోపాటు హద్దు రాళ్లు కూడా పాతారు. జిల్లాలో చాలా భాగం రీ సర్వే చేయడం మంచి పరిణామం. భూ తగాదాలకు తావుండదని భావిస్తున్నాను.

– శంకరరావు, రైతు, తాడికొండ

డివిజన్ పరిధిలో పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనుల నేపథ్యంలో డివిజన్ మీదుగా పలు రైళ్లను రద్దు చేయడం జరిగిందని శుక్రవారం డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ వెల్లడించారు. గుంటూరు - సికింద్రాబాద్(12705), సికింద్రాబాద్ - గుంటూరు(12706), గుంటూరు - సికింద్రాబాద్(17201), సికింద్రాబాద్ - గుంటూరు(17202) రైళ్లు ఈనెల 29 నుంచి మే 10వ తేదీ వరకు, అలాగే మే 16 నుంచి మే 22వ తేదీ వరకు రద్దు చేయడం జరిగిందని తెలిపారు. తిరుపతి - సికింద్రాబాద్(07481) రైలు ఈనెల 28వ తేదీ, మే 5, మే 12, 19 తేదీల్లో రద్దు చేయడం జరిగిందన్నారు. సికింద్రాబాద్ - తిరుపతి(07482)రైలు ఈనెల 29, మే 6, మే 13, మే 20 తేదీల్లో రద్దు చేయడం జరిగిందని తెలిపారు. హైదరాబాద్ - నర్సాపూర్(07631) మే 4, 11, 18 తేదీల్లో, నర్సాపూర్ - హైదరాబాద్(07632) రైలు మే 5, 12, 19 తేదీల్లో రద్దు చేయడం జరిగిందని తెలిపారు.

క్లుప్తంగా

విలువలతో కూడిన విద్యాబోధన

వైస్ చాన్సలర్ గుళ్లపల్లి శ్రీనివాస్



నగరంపాలెం: కంచి కామకోటి ఆచార్యుల ఆశీర్వాదంతో విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే విధంగా వ్యక్తిగత శ్రద్ధ, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యాబోధన చేస్తున్నట్లు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ విశ్వ మహా విద్యాలయం(డీమ్డ్ విశ్వవిద్యాలయం) వైస్ చాన్సలర్ గుళ్లపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదిక వేదికపై శ్రీ కంచి కామకోటి పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైస్ ఛాన్సలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కాంచీపురంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్, ఆయుర్వేదం, మేనేజ్‌మెంట్, ఇతరత్రా యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభమైనట్లు తెలిపారు. ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు చెప్పారు. అవకాశాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శాకాహార భోజనం, జిమ్, ఆధునిక క్రీడా స్థలం, హాస్టల్ వసతి, ప్లేస్‌మెంట్స్, అధునాతన పరిశోధనా అవకాశాలతోపాటు యోగా, ఆయుర్వేదం, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, పలు అంశాల్లో శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో కె.రామారావు, దేవస్థానం బోర్డు అధ్యక్షులు మస్తాన్‌రావు, అడ్మిషన్ల చైర్మన్ కె.వెంకటరమణ పాల్గొన్నారు.

గుంటూరు డివిజన్ మీదుగా పలు రైళ్లు రద్దు

సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పలు అభివృద్ధి పనులు చేపట్టిన నేపథ్యంలో పలు రైళ్లు రద్దు చేసినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ గురువారం వెల్లడించారు. రైలు నంబర్ 07783 విజయవాడ- గుంటూరు, 07788 గుంటూరు- విజయవాడ, 07276 కాచిగూడ- మిర్యాలగూడ, 07277 మిర్యాలగూడ- నడికుడి రైలు ఈ నెల 29వ తేదీ నుంచి మే 5వ తేదీ వరకు రద్దు చేసినట్లు తెలిపారు. 07973 నడికుడి - మిర్యాలగూడ, 07974 మిర్యాలగూడ- నడికుడి రైళ్లు ఈనెల 30వ తేదీ నుంచి మే 23వ తేదీ వరకు రద్దు చేయడం జరిగిందని చెప్పారు. 07791 కాచిగూడ- నడికుడి, 07792 నడికుడి- కాచిగూడ రైలు మే ఒకటో తేదీ నుంచి మే 31వ తేదీ వరకు రద్దు చేసినట్లు వివరించారు. రైలు నంబర్ 07779 గుంటూరు- మాచర్ల మీదుగా ప్రయాణించాల్సిన రైలును తాత్కాలిక రద్దు చేస్తూ ఈ రైలు గుంటూరు- నడికుడి మీదుగా ప్రయాణిస్తుందని, 07780 రైలు మాచర్ల- గుంటూరు మీదుగా ఈనెల 29వ తేదీ నుంచి మే 22 వరకు నడికుడి- గుంటూరు మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. ప్రయాణికులు గమనించి సురక్షితమైన ప్రయాణం చేయాల్సిందిగా కోరారు.

ముగిసిన నాక్ బృందం పర్యటన

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నాక్ బృందం పర్యటన శుక్రవారంతో ముగిసింది. నాక్ బృందం చైర్మన్ ప్రొఫెసర్ రాజేష్ సింగ్, మెంబర్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ రాజగోపాల్ శరవణన్, సభ్యులు ప్రొఫెసర్ సచిన్ దేశ్ ముఖ్, ప్రొఫెసర్ అనిల్ కుమార్ మహాపాత్ర, ప్రొఫెసర్ డేవిడ్ పీటర్, ప్రొఫెసర్ సంజయ్ కె.జైన్ యూనివర్సిటీలోని విభాగాలు, కార్యాలయాలు సందర్శించారు. మూడు రోజుల పాటు ఇటీవల ఏఎన్‌యూ సమర్పించిన ఎస్ఎస్ఆర్(సెల్ఫ్ స్టడీ రిపోర్ట్)కి అనుగుణంగా ఏఎన్‌యూలో అని సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాలు పరిశీలించారు.యూనివర్సిటీ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి యూనివర్సిటీ వారికి అందిస్తున్న సేవలు, యూనివర్సిటీ అభివృద్ధికి వారు అందిస్తున్న సహకారం తదితర అంశాలు అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. కమిటీ సభ్యులు మూడు బృందాలుగా యూనివర్సిటీలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాల్లో విద్య, పరిశోధన, బోధన, ఉద్యోగాల కల్పన సంబంధిత అంశాలు, మౌలిక వసతులపై ఆరా తీశారు. విశ్వవిద్యాలయంలో ఉన్న బెస్ట్ ప్రాక్టీస్‌లో భాగంగా వసతి గృహాల ప్రాంగణంలో కూరగాయలను పండించి నేరుగా వసతి గృహాలకు పంపిణీ చేయడం, వసతి గృహాలకు అత్యంత నాణ్యత గల కంగన్ వాటర్ అందించడం, ప్రతి వసతి గృహం లో రీడింగ్ రూమ్, వేడి నీటి వసతి కల్పించటం, విద్యార్థులకు ఉచితంగా సివిల్స్, గ్రూప్స్, యూజీసీ నెట్, సీఎస్ఐఆర్ నెట్, జి పాట్, గేట్, వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వడం వంటి ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నామని యూనివర్సిటీ ఉన్నతాధికారులు నాక్ బృందం దృష్టికి తీసుకెళ్లారు. మూడు రోజుల పర్యటనలో చివరిరోజైన శుక్రవారం నాక్ బృందం యూనివర్సిటీ ఉన్నతాధికారులు, ప్రిన్సిపాల్స్, డీన్, విభాగాధిపతులు, కోఆర్డినేటర్లతో ఎగ్జిట్ మీటింగ్ నిర్వహించింది. నాక్ బృందం అన్ని అంశాలతో షీల్డ్ కవర్లో నాక్ సంస్థకు నివేదిక సమర్పిస్తుంది. ఆ నివేదిక ఆధారంగా నాక్ సంస్థ ఏఎన్‌యూకి గ్రేడ్ సాధిస్తుంది.

మాలల ద్రోహి చంద్రబాబు

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు



మాట్లాడుతున్న నత్తా యోనారాజు

తాడికొండ: మాలల ద్రోహి చంద్రబాబు నాయుడు అన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు పేర్కొన్నారు. శుక్రవారం తాడికొండ అడ్డరోడ్డులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్నదమ్ముల్లా ఉన్న మాల మాదిగల మధ్య చిచ్చుపెట్టి మాలలకు తీరని అన్యాయం చేశారని చెప్పారు. బాబు పెట్టిన చిచ్చు కారణంగా మాలలు చాలా వెనుకబాటుతనానికి గురై యువత ఉద్యోగాలు లేక చాలా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో మాలలకు ఒక మంత్రి పదవి ఇస్తే 2019లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయినప్పటి నుంచి మాలలకు రాజకీయంగా మంచి ప్రాధాన్యం ఇచ్చి చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో డెప్యూటీ సీఎం, రెండు మంత్రి పదవులు, ఒక రాజ్యసభ, ఒక శాసన మండలి చైర్మన్, ఎస్సీ కమిషన్ చైర్మన్, 22 మంది ఎమ్మెల్యేలు, 3 ఎమ్మెల్సీలు, వివిధ నామినేటెడ్ చైర్మన్‌లు, వైస్ చైర్మన్లు, జెడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్‌లుగా అవకాశం కల్పించారన్నారు. ఎస్సీలకు దాదాపు 4,507 పోస్టులు కేటాయించగా అందులో మాలలకు 60 శాతం మాలలకిచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతోందన్నారు. ఏపీ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మొట్టమొదటి సారిగా మాలలకు మహిళా హోమ్ మినిస్టర్ పదవి కేటాయించి మేకతోటి సుచరితకి అవకాశం కల్పించి చరిత్ర తిరగరాసిన జగనన్నకు మాలలు అన్ని విధాలా రుణపడి ఉంటారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా, సుచరితమ్మను ఎమ్మెల్యేగా గెలిపించి కానుకగా ఇవ్వాలన్నారు. 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న మాలలందరూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, 25 ఎంపీలకు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు గుంటూరు జిల్లా యూత్ ప్రెసిడెంట్ యామర్తి ఇమ్మానుయేల్ రాజు, రాష్ట్ర యూత్ ఇన్‌చార్జి బాపట్ల అనిల్ పాల్గొన్నారు.

మే 5న గిరిజనుల ఆత్మీయ సమ్మేళనం

విజయపురి సౌత్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం ఆధ్వర్యంలో మే 5న మాచర్ల పట్టణంలోని మానుకొండ కళ్యాణ మండపంలో జరిగే గిరిజనుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి గిరిజనులు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ కోరారు. శుక్రవారం విజయపురిసౌత్ లో జరిగిన గిరిజనుల సమావేశంలో మేరాజోత్ హనుమంత్ నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గిరిజనుల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. సీఎం జగన్ తన మంత్రి మండలిలో గిరిజనులైన పాముల పుష్ప శ్రీవాణి, పీడిక రాజన్న దొరకు ఉప ముఖ్యమంత్రులుగా అవకాశం కల్పించారన్నారు. గిరిజనుల ప్రయోజనాల కోసం ప్రత్యేక ఎస్టీ కమీషన్ ను ఏర్పాటు చేసిన ఘనత దేశంలో జగన్ మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి, శ్రీశైలం దేవస్థానం పాలకమండలిలో మొట్టమొదటి సారిగా గిరిజనులను సభ్యులుగా నియమించి గిరిజనుల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకున్నారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గిరిజనులకు అన్యాయం చేశారన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి

- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సతీమణి లక్ష్మి
- నవులూరు దళితవాడ మహిళలతో ఆత్మీయ సమావేశం



నవులూరు దళితవాడ మహిళలతో మాట్లాడుతున్న సజ్జల లక్ష్మి

మంగళగిరి: వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సతీమణి సజ్జల లక్ష్మి కోరారు. వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి మురుగుడు లావణ్యకు మద్దతుగా నవులూరు దళితవాడ మహిళలతో శుక్రవారం ఆమె ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సజ్జల లక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి వారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకుందన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సంఘం ఉపాధ్యక్షుడు చిల్లపల్లి మోహన్‌రావు, మానవ హక్కుల కమిషన్ సభ్యులు జి.శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పచ్చల శ్యామ్‌బాబు, మాజీ ఎంపీపీ పచ్చల రత్నకుమారి, మహిళా నేత మల్లవరపు సుధారాణి పాల్గొన్నారు.

రూ. 5.99 కోట్ల విలువైన సిగరెట్లు ధ్వంసం

సీజీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి వెల్లడి



లక్ష్మీపురం: నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తుండగా పట్టుబడి, పన్ను చెల్లించని రూ.5.99 కోట్ల విలువ చేసే నకిలీ బ్రాండెడ్ సిగరెట్లను సెంట్రల్ జీఎస్టీ అధికారులు ధ్వంసం చేసినట్లు సీజీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం వద్ద జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌లో స్వాధీనం చేసుకున్న సిగరెట్లను అన్ని అనుమతులతో సీజీఎస్టీ అధికారులు శుక్రవారం పూర్తిగా ధ్వంసం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్వంసం చేసిన సిగరెట్లు నాసిరకం, నకిలీ ఉత్పత్తులుగా నిర్ధారణ చేయడం జరిగిందన్నారు. వీటిని మార్కెట్‌లో విక్రయించడం చట్ట రీత్యా నేరమని వెల్లడించారు. ప్రజారోగ్యాన్ని హాని కలిగించే సిగరెట్లు అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతున్నామని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రానికి సరైన పన్నులు చెల్లించకుండా అక్రమంగా రవాణా చేస్తున్న సిగరెట్లు ప్రజారోగ్యానికి కూడా ఎంతో హానికరంగా పరిగణిస్తున్నామని తెలిపారు. ఈనేపథ్యంలో సిగరెట్ల అక్రమ రవాణాపై గుంటూరు సీజీఎస్టీ కమిషనర్ పరిధిలోని పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈక్రమంలో విజయవాడలో పట్టుకున్న రూ.1.11 కోట్ల విలువైన సిగరెట్లతోపాటు, మొత్తం రూ.5.99 కోట్ల విలువైన 1.14 కోట్ల సిగరెట్ల స్టిక్‌లను ధ్వంసం చేశామని తెలిపారు. ఇలాంటి పన్నులు చెల్లించని చౌకబారు సిగరెట్లు పలు అక్రమంగా మన రాష్ట్రంలోకి వస్తున్నాయని, వీటిని ఎవరైనా విక్రయించినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.403 కోట్ల విలువైన పన్ను ఎగవేతను గుర్తించి, రూ.270 కోట్లు వసూలు చేశామని తెలిపారు. సిగరెట్ల ధ్వంసంలో కమిషనర్‌తోపాటు, జాయింట్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్, సూపరింటెండెంట్లు ఆర్.పి.సి.కుమార్, గాదె శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మే 4, 5 తేదీల్లో రాష్ట్ర క్యారమ్స్ టోర్నీ

గుంటూరు వెస్ట్(క్రీడలు): వచ్చే నెల 4, 5 తేదీల్లో రాష్ట్ర ప్రథమ క్యారమ్స్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆంధ్ర స్టేట్ క్యారమ్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీ, పురుషులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 30లోగా పేర్లు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 995 111 5678 సంప్రదించాలని కోరారు.

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- ల్యాప్‌ట్యాబ్‌లు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- జీఆర్పీ సీఐ వెంకటేశ్వర్లు వెల్లడి



చోరీ చేసిన సొత్తుతో నిందితుడి అరెస్ట్ చూపుతున్న జీఆర్పీ సీఐ గంగావెంకటేశ్వర్లు

లక్ష్మీపురం: రైళ్లలో ప్రయాణికుల నుంచి ల్యాప్‌ట్యాబ్‌లు, సెల్‌ఫోన్‌లు చోరీలకు పాల్పడే వ్యక్తిని అరెస్ట్ చేసి, రూ.4 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే జీఆర్పీ సీఐ గంగావెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. గుంటూరు జిల్లా తెనాలి, బాలాజీరావుపేట ప్రాంతానికి చెందిన గాజుల సురేష్ సినిమా పరిశ్రమలో పని చేస్తుండేవాడు. చెడు వ్యసనాలకు బానిస అయ్యాడు. భార్య కూడా వదిలేసింది. రైళ్లలో చోరీలకు పాల్పడడం అలవాటు పడ్డాడు. సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌ట్యాబ్‌లు అపహరించి వాటిని అమ్ముకుని సొమ్ముచేసుకునే వాడు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంలో జీఆర్పీ పోలీసులు తనిఖీలు చేస్తుండగా తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. వెంటనే పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు. విచారణ చేయగా సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌ట్యాబ్‌లు చోరీకి పాల్పడుతున్నట్లు అంగీకరించాడు. అతడి బ్యాగ్‌ను పరిశీలించారు. బ్యాగ్‌లో ఆరు సెల్‌ఫోన్లు, 4 ల్యాప్ ట్యాప్‌లు, ఒక స్మార్ట్ వాచ్ దొరికాయి. దీంతో జీఆర్పీ పోలీసులు సురేష్‌పై కేసు నమోదు చేసి అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌ట్యాబ్‌లను స్వాధీనం చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసులో సహకరించిన జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రి, ఆర్పీఎఫ్ ఎస్ఐ డి.శ్రీనివాసరావు, ఎస్ఐ ఖాదర్ బాషా సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా సీఐ గంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వేసవి కాలంలో రైళ్లలో ప్రయాణికులు వేమరపాటుగా ఉంటే విలువైన వస్తువులు చోరీకి గురవుతాయని, ప్రయాణికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు.

సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విజయకేతనం



సాయి వెంకట ధీరజ్‌ను అభినందిస్తున్న నందకిషోర్, శ్రీలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) గురువారం ప్రకటించిన సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యాసంస్థల విద్యార్థి అన్నా సాయి వెంకట ధీరజ్ అఖిల భారతస్థాయిలో ప్రథమ ర్యాంకు కైవసం చేసుకున్నట్లు సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. కొత్తపేటలోని శ్రీమేధ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నందకిషోర్ మాట్లాడుతూ డిసెంబర్-2023 సీఎంఏ ఫౌండేషన్ ర్యాంకుల జాబితాలో తమ విద్యార్థి 340 మార్కులతో ఆలిండియా టాపర్‌గా నిలిచాడని వివరించారు. తమ సంస్థ అందిస్తున్న ఇంటర్ ఎంఈసీ కాయిన్ ప్రోగ్రాం ద్వారా ఏక కాలంలో సీఏ, సీఎంఏ ఫౌండేషన్ శిక్షణ పొందిన సాయి వెంకట ధీరజ్ సీనియర్ ఇంటర్‌లో 979 మార్కులతో రాష్ట్రస్థాయిలో టాపర్‌గా నిలిచినట్లు చెప్పారు. ఈసందర్భంగా అన్నా నందకిషోర్, డైరెక్టర్ అన్నా శ్రీలక్ష్మి విద్యార్థికి జ్ఞాపిక బహుకరించి, అభినందించారు.

అమరావతి కరకట్ట వెంబడి మంటలు



తాడేపల్లిరూరల్: ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాంతం ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి తీసివేసిన అరటితోటలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో శుక్రవారం రాత్రి కరకట్ట వెంబడి ఉన్న పంటపొలంలో మంటలు కరకట్టకు వ్యాపించాయి. ఆ రహదారి నిత్యం వీవీఐపీలు ప్రయాణించడం, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు నివాసం ఉండడంతో అన్ని శాఖల అధికారులు ఘటనా స్థలానికి చేరి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. రాత్రి 7.30 వరకు నాలుగు ట్యాంకుల నీటిని ఉపయోగించినా మంటలు అదుపులోకి రాలేదు. స్థానికంగా ఉన్న రైతుల సహకారంతో పంట పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్లను ఉపయోగించి మంటలను అదుపు చేస్తున్నారు. అగ్నిమాపక సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అరటి గెలలు అయిన అనంతరం చెట్లను నరకడం, అవి ఎండకు బాగా ఎండిపోవడంతో బహుశా ఎవరో సిగరెట్ కానీ, బీడీ కానీ విసిరి పారవేసి ఉంటారని, ఎండిపోయిన అరటి ఆకుల మీద పడి మంటలు చెలరేగి ఉంటాయని, 8 గంటలకు పూర్తిగా మంటలను అదుపు చేస్తామని ఆయన తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపు

కరకట్ట వెంబడి మంటలు నేపథ్యంలో ప్రకాశం బ్యారేజ్ నుంచి ఉండవల్లి సెంటర్‌కు వాహనాలను మళ్లించి ఉండవల్లి అనంతపద్మనాభస్వామి గుహల నుంచి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. అమరావతి నుంచి వచ్చే వాహనాలను అప్పారావు గెస్ట్‌హౌస్ వద్ద నుంచి ఉండవల్లి సెంటర్‌కు మళ్లించారు. తాడేపల్లి పోలీసులతో పాటు ప్రతిపక్షనాయకుడు నివాసం వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.